
చాకలి ఐలమ్మ గొప్ప స్ఫూర్తి ప్రదాత



కలెక్టరేట్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప స్ఫూర్తి ప్రధాత అని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. నిజాం కాలంలో చాకలి ఐలమ్మ భూమిని కౌలుకు తీసుకొని పండించిన పంటకు శిస్తు అని చెప్పి పంటను దోచుకెళుతుంటే జరిగిన అన్యాయానికి ఎదురొడ్డి పోరాడిందన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో కలిసి ఉద్యమం నడిపారని గుర్తు చేశారు. దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి బీరంసుబ్బారెడ్డి, రజక, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : ఈ నెల 28న వనపర్తి జిల్లా కేంద్రంతో పాటు ఆత్మకూరు కోర్టుల్లో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని ఏఎస్పీ రామదాసుతేజ అన్నారు. జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్‌లో రాజీ పడే అవకాశం ఉన్న కేసుల జాబితాను తయారు చేసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. ఇరువర్గాల వారిని పిలిపించి కేసులతో జీవితాలను నాశనం చేసుకోవద్దని, రాజీమార్గమే ఉత్తమమని చెప్పాలని సిబ్బందికి సూచించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు.

పాలమూరుకు పర్యాటక శోభ

మూడు విభాగాలుగా అభివృద్ధికి సర్కారు ప్రణాళికలు

ఈనాడు, మహబూబ్‌నగర్ : నల్లమల అందాలు, దేవాలయాలు, పురాతన కోటలు, కృష్ణా, తుంగభద్ర నదులు వంటి ఎన్నో పర్యాటక ప్రాంతాలకు పాలమూరు నెలవు. ఇప్పటికే పర్యాటకులు పాలమూరుపై ఆసక్తి చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పర్యాటక రంగాన్ని ప్రకృతి, ఆధ్యాత్మికం, నది విభాగాలుగా విభజించి కొత్త పుంతలు తొక్కించాలని యోచిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లోనూ నల్లమల ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. జులై మొదటి వారంలోనూ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు నల్లమలను సందర్శించి పర్యాటక రంగాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్నదానిపై సమీక్ష నిర్వహించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'ఈనాడు' ప్రత్యేక కథనం.

నల్లమలలో ప్రత్యేక ఆకర్షణ..

ఉమ్మడి జిల్లాలో అత్యంత కీలక పర్యాటక ప్రాంతం నల్లమల. ఇక్కడికి ఇతర దేశాల నుంచి కూడా పర్యాటకులను రప్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే కొల్లాపూర్ అటవీ ప్రాంతంలోని అమరగిరి వద్ద పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందిస్తోంది. నల్లమలలో ప్రకృతి, ఆధ్యాత్మిక, నది విభాగాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేయనున్నారు. సోమశిల నుంచి కృష్ణానదిలో పడవ ప్రయాణం చేస్తూ పాతాళగంగ, శ్రీశైల మల్లికార్జునస్వామి దర్శనం చేసుకునేలా గతంలో పర్యాటక శాఖ టూరిజం అభివృద్ధి చేసింది. ఫర్హాబాద్ వ్యూపాయింట్, మల్లెల తీర్థం, సోమేశ్వరాలయాలను కూడా చూడవచ్చు. నల్లమల అడవుల్లోనూ జంగిల్ సఫారీకి ఏర్పాట్లు చేయనున్నారు. ట్రెక్కింగ్‌కూ అవకాశం కల్పిస్తున్నారు.



నల్లమలలోని ప్రకృతి అందాలు



జోగులాంబ అమ్మవారి ఆలయం

ఆధ్యాత్మిక క్షేత్రాల నిలయం

తెలంగాణలోని ఏకైక శక్తిపీఠం జోగులాంబ అమ్మవారి ఆలయం అలంపూర్‌లో ఉన్నది. తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన మన్యంకొండ దేవాలయానికి వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తారు. గద్వాలలోని జములమ్మ, మల్దకల్‌లోని వేంకటేశ్వరస్వామి, బీచుపల్లిలోని ఆంజనేయస్వామి, శ్రీరంగాపూర్‌లోని శ్రీరంగనాయకస్వామి, సింగోటంలోని లక్ష్మీనరసింహస్వామి, ఉమామహేశ్వర ఆలయం, సలేశ్వరం, కురుమూర్తి, గంగాపూర్ చెన్నకేశవస్వామి వంటి ప్రముఖ ఆలయాలను కలుపుతూ ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ భావిస్తోంది. హైదరాబాద్, మహబూబ్‌నగర్ నుంచి ప్రత్యేక టూరిజం బస్సుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. గైడ్‌లను నియమించి ఉపాధి కల్పించనున్నారు.

వీటిపైనా దృష్టిపెడితే బాగు..

మహబూబ్‌నగర్ శివారులో తెగుళ్లతో దెబ్బతిన్న పిల్లలమర్రి చెట్టు సస్యరక్షణ చర్యల తర్వాత పునరుజ్జీవం పొందింది. ఇక్కడ జింకల పార్కు, చేపల మ్యూజియం ఉన్నాయి. ఇటీవల పర్యాటకుల సందర్శనకు అవకాశం కల్పించటంతో ఈ ప్రాంతానికి కొత్త శోభ వచ్చింది. నారాయణపేట జిల్లా ముడుమాల్‌లో కాలగణనకు ఏర్పాటుచేసిన పురాతన నిలువు రాళ్లు ఉన్నాయి. హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని జడ్చర్ల సమీపంలో క్రీ.శ. 12వ శతాబ్దంలో జైనులు నిర్మించిన గొల్లత్తగుడి ఉంది. ఈ గుడిని పరిరక్షించి పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

డిగ్రీ కళాశాలల్లో సమస్యల తిష్ఠ..!

ఒకే భవనంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు బోధన



అసంపూర్తి తరగతి గదులతో ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు, పెబ్బేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సమస్యలకు నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్యనందించే ఈ కళాశాలలు ఏళ్లుగా సమస్యలతో సతమతమవుతున్నాయి. అసౌకర్యాల మధ్య విద్యాభ్యాసంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సమస్యలను అధిగమిస్తూనే మూడేళ్ల డిగ్రీ పూర్తి చేస్తున్నారు. సమస్యలకు లోగిళ్లుగా మారిన ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సమస్యలపై విద్యార్థులు, స్థానికులు ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అతిథి, ఒప్పంద అధ్యాపకులతోనే విద్యాబోధన సరిపెడుతున్నారు.

నిధులు మంజూరు లేక..

పెబ్బేరు పురపాలికకు మంజూరైన డిగ్రీ కళాశాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే కొనసాగిస్తున్నారు. డిగ్రీలో బీఏ గ్రూప్‌తో మాత్రమే కళాశాలను నిర్వహిస్తున్నారు. 216 మంది విద్యార్థులు ఉన్న ఈ కళాశాలలో ఇతర గ్రూపులను ఏర్పాటు చేసే ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. గత్యంతరం లేక ఈ ప్రాంత విద్యార్థులు, వనపర్తి, గద్వాల కేంద్రాల్లోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం పొందుతున్నారు. ఒకే భవనంలో రెండు కళాశాలలను నిర్వహించడంతో స్థలాభావం తప్పడం లేదు. 8మంది ఒప్పంద, అతిథి అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. కొత్తగా డిగ్రీ కళాశాల భవనం, క్రీడాప్రాంగణం ఏర్పాటుకు 5 ఎకరాల స్థలాన్ని కేటాయించినా నిధులు మంజూరు కాక పనులు మరుగున పడ్డాయి.

చేరుకోవడానికి ప్రయాణ వెతలు..

ఆత్మకూరు పట్టణానికి దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలకు చేరుకోవడంలో విద్యార్థులకు ప్రయాణ వెతలు తప్పడం లేదు. 279 మంది విద్యార్థులతో బీఏ, బీఎస్సీ(మ్యాథ్స్), బీఎస్సీ (బీజడ్సీ), బీకాం కోర్సులు ఉన్న కళాశాలలో కేవలం ఐదు తరగతి గదుల్లో విద్యాబోధన కొనసాగుతోంది. ప్రయోగశాలలు సైతం లేక తరగతి గదుల్లోనే ప్రయోగశాలలకు చేయాల్సిన దుస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు సరిపడ మూత్రశాలలు, మరుగుదొడ్లు కరవయ్యాయి. 17 అధ్యాపక పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 10 మందితోనే నెట్టుకొస్తున్నారు. రూ. 90 లక్షల వ్యయంతో ఎనిమిదేళ్ల క్రితం చేపట్టిన అదనపు తరగతి గదులు, ప్రయోగశాలల నిర్మాణ పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపులు లేక పనులు పూర్తి చేయలేకపోతున్నామని గుత్తేదార్లు పేర్కొంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

ఆత్మకూరు డిగ్రీ కళాశాలలో నెలకొన్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. కొత్తగా ప్రతిపాదనలు పెడుతున్నాం. అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలను పూర్తి చేసేందుకు ఇటీవల ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. అసంపూర్తి భవనాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు పూర్తి చేస్తే విద్యార్థులకు కొంత సౌకర్యంగా ఉంటుంది.

\- గోపాల్, ప్రిన్సిపల్,
ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఏడాదిలోగా స్పాంజ్ ఐరన్ పరిశ్రమలు తరలించండి

- రైతులకు నష్టపరిహారం అందజేయాలి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



ఈనాడు, హైదరాబాద్ : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కోడిచర్ల, తీగాపూర్, గుండ్లపట్లపల్లి, రంగారెడ్డిగూడ, అప్పాజిపల్లి తండా గ్రామాల పరిసరాల్లో మానవ నివాసాలకు కిలోమీటరు పరిధి లోపల ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను ఏడాదిలోగా తరలించాలంటూ ప్రభుత్వానికి ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పరిశ్రమలను తరలించాక నివేదికను హైకోర్టు జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌కు సమర్పించాలని ఆదేశించింది. అక్కడి మిగిలిన పరిశ్రమలు పర్యావరణ చట్టాలకు అనుగుణంగా నడుస్తున్నాయో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు నెలల్లో నివేదిక అందజేయాలని ఆదేశించింది. పంటనష్ట పరిహారంగా పరిశ్రమలు డిపాజిట్ చేసిన సొమ్మును రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇంకా స్పాంజ్ ఐరన్ పరిశ్రమలతో పంట నష్టపోయిన రైతులు ఉంటే చట్టప్రకారం వారిని గుర్తించి పరిహారం అందజేయాలని ఆదేశిస్తూ 19 ఏళ్ల పిటిషన్‌పై విచారణను ముగించింది. ఉమ్మడి జిల్లాలోని కోడిచర్ల, తీగాపూర్, గుండ్లపట్లపల్లి, రంగారెడ్డిగూడ, అప్పాజిపల్లి తండా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో స్పాంజ్ ఐరన్ పారిశ్రామిక యూనిట్లు నిర్వహిస్తుండటాన్ని సవాలు చేస్తూ 2005లో షాద్‌నగర్‌కు చెందిన టి.వీరేందర్‌రెడ్డి మరో 8 మంది ప్రజాప్రయోజన పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఈ పరిశ్రమల కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని, వ్యవసాయం చేయలేకపోతున్నట్లు తెలిపారు. పచ్చదనం హరించుకుపోతోందని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కాలుష్య నివారణకు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు చర్యలు తీసుకోవడంలేదని పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు ఆదేశాల మేరకు పీసీబీ నివేదికను సమర్పించింది. జైసీ స్పాంజ్ ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి ఉద్యోగ్ లిమిటెడ్, జి.కె.స్పాంజ్ ఐరన్ ప్రైవేట్ లిమిటెడ్, శీతల్ షిప్పింగ్ అండ్ మెటల్ ప్రాసెసర్స్ లిమిటెడ్, బింజు మెటల్స్ అండ్ అలాయ్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, హార్మోనీ స్పాంజ్ ఐరన్ ఇండస్ట్రీ, శివధాత్రి ఫెర్రో అల్లాయ్స్, ఏపీఎస్ఎం అల్లాయ్స్ ప్రైవేట్ లిమిటెడ్, దేవశ్రీ ఇస్పాత్ లిమిటెడ్‌లు పనిచేయడంలేదని పేర్కొంది. బిలస్రాయికా స్పాంజ్ ఐరన్ ఇండియా, బింజుసారియా స్పాంజ్ అండ్ పవర్, ఆనంద్ మెటాలిక్స్ అండ్ పవర్, సుందర్ ఇస్పాత్ లిమిటెడ్, వినాయక స్టీల్స్, రాయిటర్ మెటల్స్ ఆఫ్ ఇండియా, కేడియా అల్లాయ్స్ లిమిటెడ్, సిరి శివశక్తి స్టీల్స్ అల్లాయ్స్‌లు ఎన్జీటీని ఆశ్రయించాయని, దీనిపై 2022లో ఎన్జీటీ ఉత్తర్వులు జారీచేస్తూ జనావాసాలకు కి.మీ.లోపు ఉన్నవాటిని తరలించాలని ఆదేశించిందని తెలిపింది. టీఎస్ఐఐసీ 2020లో ప్రణాళిక సమర్పిస్తూ నివాస ప్రాంతాలకు సమీపంలో ఉన్న ఆనంద్ మెటాలిక్స్ అండ్ పవర్, సుందర్ ఇస్పాత్ లిమిటెడ్, వినాయక స్టీల్స్, రాయిటర్ మెటల్స్ ఆఫ్ ఇండియా, కేడియా అల్లాయ్స్ లిమిటెడ్, సిరి శివశక్తి స్టీల్స్ అల్లాయ్స్‌లను మరోచోటికి తరలించాలని సిఫారసు చేసిందని తెలిపింది. బిలస్రాయికా స్పాంజ్ ఐరన్ ఇండియా, బింజుసారియా స్పాంజ్ అండ్ పవర్, రాయిటర్స్ మెటల్స్ ఆఫ్ ఇండియా పరిశ్రమలు జనావాసాలకు కిలోమీటరు కంటే ఎక్కువ దూరంలో ఉన్నట్లు వివరించింది. వీటన్నింటినీ పరిశీలించిన ధర్మాసనం జనావాసాలకు కిలోమీటరు దూరంలోలోపల ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను తరలించి నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేసింది.

పల్లీ రైతుల పరేషాన్

వేరుశనగ విత్తనాలకు రెక్కలు



అనంతపురం వేరుశనగ విత్తనాలతో రైతు నారాయణరెడ్డి

కల్వకుర్తి, న్యూస్‌టుడే: వేరుశనగ రైతులు విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. విత్తనాలు కొనబోతే ధరలు ఆకాశంలో ఉంటుండగా అమ్మబోతే గిట్టుబాటు లేక విలవిలలాడే పరిస్థితి నెలకొంది. రెండు రోజుల నుంచి వర్షం పడుతుండటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యాసంగి వేరుశనగ సాగు మొదలైంది. విత్తనం కొనుగోలుకు డిమాండ్ ఉండటంతో వ్యాపారులు ధరలు పెంచారు. ఆగస్టులో క్వింటా వేరుశనగ విత్తనానికి రూ.9,000 నుంచి రూ.11,600 వరకు ధరలకు అమ్మారు. సెప్టెంబరులో రూ.12,000 నుంచి 13,800 వరకు పెరిగింది. క్వింటా రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ధరలు పెంచడంతో రైతులకు ఆర్థిక భారంగా మారింది. ఎకరానికి 65 కిలోల విత్తనాలు కావాల్సి ఉండటంతో పెద్దరైతులు మంచి విత్తనం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, తిరుపతి జిల్లాల్లోని పల్లి మిల్లులు, రైతుల చెంతకు పరుగులు తీస్తున్నారు. 2024 మార్చిలో రైతులు వేరుశనగను క్వింటాకు రూ.4,100 నుంచి రూ.7,600 వరకు మార్కెట్‌లో అమ్మారు.

- వేరుశనగ విత్తనాలు ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాలో అందుబాటులో లేవు. ప్రభుత్వం రాయితీపై అందించడం లేదు. వనపర్తి విత్తనోత్పత్తి సంస్థలో కే-6, కదిరి లేపాక్షి-1812 రకాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.
- 2023లో యాసంగిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.20 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు పుష్కలంగా కురవటంతో వేరుశనగ సాగు 2.60 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో అధికంగా సాగు చేస్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మిడ్జిల్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో అధికంగా వేరుశనగ విత్తుతారు.
- వనపర్తి విత్తన శుద్ధి కేంద్రం ద్వారా..: ఉమ్మడి జిల్లాలో వనపర్తిలోని తెలంగాణ విత్తనోత్పత్తి సంస్థ ద్వారా ఊర్కొండ, మిడ్జిల్, కల్వకుర్తి, వంగూరు, ఉప్పునుంతల, గద్వాల, అలంపూర్ మండలాల రైతులు అధిక మొత్తంలో విత్తనం వేరుశనగ కాయలు కొనుగోలు చేసి, మిల్లుల్లో విత్తనంలా మార్చి అమ్మకాలు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు పరుగులు..: మిడ్జిల్, ఊర్కొండ మండలాలకు చెందిన రైతులు నేరుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా రైతుల నుంచి కే-6, 1694 రకాలను క్వింటా రూ.13,000 చొప్పున కొనుగోలు చేశారు. ఈ రెండు రకాల విత్తనాలను 305 కిలోల విత్తనాలను కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. స్థానికంగా దొరికే వేరుశనగ విత్తనం కన్నా అనంతపురంలో కొనుగోలు చేసిన విత్తనం క్వింటా రూ. వెయ్యి తక్కువకే వస్తోందని మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామ రైతు సింగిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం..: వేరుశనగ విత్తనంపై ధరలు నిర్ణయం మా పరిధిలో లేదు. రైతులే ఇతర ప్రాంతాలకు వెళ్లి విత్తనం కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేలా అవగాహన కల్పిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు.

జిల్లాలో రెండు పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటు: కలెక్టర్



వనపర్తిలో పట్టణాభివృద్ధి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు జిల్లాలో రెండు పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. గురువారం వనపర్తి కలెక్టరేట్ కార్యాలయంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్ని పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేయాలని, ఏఏ ప్రాంతాలను కలపాలని కమిటీ సభ్యులతో చర్చించారు. వనపర్తి, పెబ్బేర్, కొత్తకోట ఒకటి.. ఆత్మకూరు, అమరచింత కలిపి రెండో పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేసేందుకు కమిటీ నిర్ణయం తీసుకున్నారు. రెండు పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటు కోసం నివేదిక పంపనున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, డీపీవో సురేష్, పురపాలికల కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, డీఎల్‌పీవో తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేక.. నిఘా కన్ను మూత?

- కస్తూర్బాల్లో పని చేయని సీసీ కెమెరాలు



పెంట్లవెల్లి కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ అయి 18 విద్యార్థుల అస్వస్థతకు గురయ్యారు. ఆహార పదార్థాల కల్తీ వల్లనే ఇది జరిగిందనే స్పష్టం కాని దాన్ని నిగ్గుతేల్చటానికి ఆధారాల్లేని పరిస్థితి. సీసీ కెమెరాలు ఉంటే కొంత వరకైనా ఎలా జరిగింది అనేది తెలుసుకునే అవకాశం ఉండేది.

గద్వాల జిల్లాలోని ఓ కేజీబీవీ గోడ దూకి బాలిక పారిపోయింది. ఆమె సరాసరి ఇంటికి పోవడంతో సరిపోయింది. లేకుంటే..

వెల్దండ ఆదర్శ పాఠశాలలో అన్నంలో పురుగులు వచ్చాయి. బియ్యం నాణ్యంగా లేకపోవటమే కారణం. దీంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

ధరూరు కేజీబీవీలో సరకులు పక్కదారి పట్టాయని ఆరోపణలు రావటంతో నలుగురిపై వేటు పడింది. అయితే సీసీ కెమెరాలు లేని కారణంగా ఎంత మేర సరకులు బయటకు వెళ్లాయన్నది గుర్తించ లేకపోయారు. గట్టు గురుకులంలో సైతం గతంలో ఇలాంటి వ్యవహారమే చోటు చేసుకుంది.

కొన్ని కేజీబీవీల్లోకి ఆగంతకులు వచ్చిపోతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. మరి ముఖ్యంగా కొన్ని ఊరికి దూరంగా ఉండటం వల్ల సీసీ కెమెరాలు లేకపోతే రక్షణ ఎలా సాధ్యం అన్న ప్రశ్న ఉదయిస్తోంది.



గద్వాల నియోజకవర్గంలోని ఓ కస్తూర్బాలో పనిచేయని సీసీ కెమెరా

ధరూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు భద్రత కల్పించేందుకు, వచ్చేపోయే వారిపై నిఘా ఉంచటానికి ప్రభుత్వం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. గురుకుల ప్రవేశ ద్వారంతో పాటు వంట గది ఉన్న చోట ఇతర కీలకమైన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఇవి పనిచేయటం లేదని విద్యార్థినులే చెబుతున్నారు. ముఖ్యంగా కస్తూర్బా పాఠశాలలు అంటే బాలికలు ఉంటారు. ప్రస్తుతం చాలావాటిలో ఇంటర్ వరకు తరగతులున్నాయి. 7 నుంచి 17లోపు బాలికలు ఉంటారు. తప్పనిసరిగా భద్రత అవసరం.

నిర్వహణ లేక: వీటి నిర్వహణకు నిధులు రాకపోవటంతో వాటిని పట్టించుకోవటం లేదనే మాట వినిపిస్తోంది. ఆయా కస్తూర్బాల్లో సీసీ కెమెరాలు పనిచేయని పక్షంలో ఎస్వోలు జీసీడీవో దృష్టికి తీసుకెళ్లటం. ప్రత్యేక నిధులు ఏవైనా ఉంటే వాటి ద్వారా మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది. నిధుల్లేకపోతే గురుకుల సొసైటీకి నివేదిక పంపి మరమ్మతులకు నిధులు, అనుమతులు తెప్పించాల్సి ఉంటుంది. కానీ అది జరగటం లేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 72 కస్తూర్బా పాఠశాలలుంటే యాభైకిపైగా పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉంది. నిఘా వ్యవస్థ పటిష్ఠంగా ఉంటే కస్తూర్బాల్లో సరకుల పక్కదారి, అక్రమాలు, విధులకు ఉపాధ్యాయులు రాని విషయం నమోదయ్యే పరిస్థితి ఉంటుంది. నిఘా కన్ను మూతపడినా పట్టించుకోకపోతే మాత్రం అక్రమాలకు పర్యవేక్షణ అధికారులే అవకాశం కల్పించినట్లవుతుంది. మరమ్మతులకు ప్రభుత్వం నిధులు ఇచ్చి నిఘా కన్నును పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థులంటున్నారు.

ఖర్చు రూ.కోట్లలోనే: ఉమ్మడి జిల్లాలో 72 కస్తూర్బా పాఠశాలలున్నాయి. ఇందులోని సుమారు 15 వేల మంది విద్యార్థినుల చదువుకు ప్రభుత్వం రూ. 32.30 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఇంత పెద్ద ఎత్తున గురుకులాల్లో ఖర్చు ప్రభుత్వం చేస్తుండగా నిధుల సద్వినియోగంపై నిఘా ఉంచాల్సిన అవసరం కూడా ఉంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి నిఘా కెమెరాలను మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. పోలీసు కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం ఎలా ఉంటుందో.. జిల్లా పాలనాధికారి కార్యాలయానికి కస్తూర్బా, గురుకులాల్లోని సీసీ కెమెరాలు అనుసంధానమై ఉంటే నిత్య పర్యవేక్షణ చేయవచ్చు. విధి నిర్వహణ, వసతుల కల్పన అన్నింటిపై నిఘా ఉంచవచ్చు.

మరమ్మతులు చేపడతాం: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపడుతామని గద్వాల జిల్లా విద్యాధికారి రవీందర్ తెలిపారు.

రాష్ట్రంలోనే అత్యధిక క్లబ్‌ల ఏర్పాటు

పురస్కారానికి ఎంపికైన మహబూబ్‌నగర్ కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్రంలోనే అత్యధికంగా యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసినందుకు గాను ఈనెల 27న హైదరాబాద్‌లో నిర్వహించే ప్రపంచ పర్యాటక దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అవార్డు అందుకోనున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, పాలమూరు విశ్వవిద్యాలయం, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో సుమారు 1,350కి పైగా యువ టూరిజం క్లబ్బుల ఏర్పాటుకు కలెక్టర్ కృషి చేశారు. ఒక్కో క్లబ్‌లో 25 మంది విద్యార్థులు ఉంటారు. పర్యాటకం, సంస్కృతీ సంప్రదాయాలు, వారసత్వ సందపపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ క్లబ్‌ల లక్ష్యం. భవిష్యత్తులో పర్యాటకం వల్ల కలిగే లాభాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పర్యాటక అనుబంధ రంగాల అభివృద్ధి తదితర అంశాలపై చిన్నప్పటి నుంచే అవగాహన పెంచుకునే అవకాశం యువ టూరిజం క్లబ్బుల ద్వారా విద్యార్థులకు కల్పించినందుకు గాను ఈ పురస్కారం దక్కనుంది.

వైభవంగా సీతారాముల కల్యాణం



బీచుపల్లిలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండ రామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. పండితులు భువనచంద్ర, దినకరాచార్యులు, దత్తుస్వామి, భానుమూర్తి వేదమంత్రోచ్ఛారణలు, భాజా భజంత్రీల నడుమ కమనీయంగా జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ మేనేజర్ సురేందర్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

367.875 మిలియన్ యూనిట్లకు చేరిన జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టు నుంచి వరదనీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి 367.875 మిలియన్ యూనిట్లకు చేరింది. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.186, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 3.581 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. నీటిపారుదలశాఖ అధికారులు జలవిద్యుదుత్పత్తికి 34,499 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునే దిశగా ఎగువన 197.260, దిగువన 170.615 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధ్యపడినట్లు జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

సత్యశోధన కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, తదితరులు

అలంపూర్, న్యూస్‌టుడే: వచ్చే నెల 2వ తేదీన అలంపూర్ ఆలయాల నుంచి ఉమామహేశ్వర ఆలయం బాపూ బాటలో చేపట్టిన 'సత్యశోధన' పాదయాత్ర కరపత్రాన్ని గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ఆవిష్కరించారు. విశ్రాంత విద్యాశాఖ అధికారి శివార్చక విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర జరగనుంది. 100 రోజుల్లో 1,000 కిలోమీటర్లు సాగనుంది. యువత మంచి మార్గంలో నడవాలని ఈ కార్యక్రమం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మనమెప్పుడలా..?



ఉమిత్యాల ప్రాథమికోన్నత పాఠశాలకు ఇదే ఆటస్థలం



పోషకాహారలేమి.. కొరవడిన క్రీడా శిక్షణ

వారం రోజుల కిందట జరిగిన హాకీ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ పోటీల్లో భారత్ విజేతగా నిలిచింది. సెమీస్‌లో జట్టుకు కొరియాపై హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్, జర్మన్‌ప్రీత్ సింగ్, ఉత్తమ్ సింగ్ ఒక్కో గోల్ చేసి జట్టును ఫైనల్‌కు చేర్చారు. ఫైనల్‌లో చైనాతో తలపడినపుడు జుగ్‌రాజ్‌సింగ్ ఏకైక గోల్ చేసి భారత్‌ను గెలిపించారు. భారత్ విజేతగా నిలిచిన వీరంతా సింగ్‌లే. మరి మనమెప్పుడలా చిరుతల్లా మెరిసేది?

● ఉమ్మడి జిల్లాలో 56 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 17,500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఆటలు ఆడించేందుకు ఒక్కరే పీఈటీ ఉన్నారు.

● గద్వాల పట్టణంలోని అక్షయ అనువస పాఠశాలలో 1,150 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ 2018 నుంచి పీఈడీ, పీఈటీ లేరు. ఇక ఆటలు ఆడించేదెవరు?

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్

క్రీడలపై ప్రభుత్వం ఆసక్తి మాటలకే పరిమితమవుతోంది. పాఠశాల స్థాయిలో నామమాత్రంగా కేటాయిస్తున్న నిధులే అందుకు నిదర్శనం. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ పోటీలకే దాతల సాయం తీసుకోవాల్సిన దుస్థితిలో మనం విజేతలు నిలిచేదెలా?

శిక్షకుల కొరత

ఉమ్మడి జిల్లాలో 3,227 ప్రభుత్వ పాఠశాలలుంటే 3.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి 250 మంది విద్యార్థులకు ఒక పీఈటీ ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే ఐదు జిల్లాల్లో కలిపి 275 మంది పీఈడీలు, 45 మంది పీఈటీలు మాత్రమే ఉన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 95 ఉన్నత పాఠశాలలకు 42 మంది పీఈడీలు మాత్రమే ఉన్నారు. ఫలితంగా క్రీడలపై విద్యార్థులకు శిక్షణ ఉండటం లేదు.

మైదానాలేవీ

క్రీడల్లో రాణించాలంటే ప్రతి పాఠశాలకు మైదానం తప్పనిసరి. 236 పాఠశాలల్లో అసలు మైదానాలే లేవు. కళాశాలల్లో కొన్ని చోట్ల నిబంధనల ప్రకారం లేవు. ఒక ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల పరిస్థితి చెప్పనక్కర్లేదు. చిన్నపాటి ఆట స్థలం లేదా పైఅంతస్తుల్లో నిర్వహిస్తున్న పరిస్థితులు కోకొల్లలు. దీనికి తోడు 50 శాతం పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా సామగ్రి లేదు. అరకొరగా ఉన్న వాటితో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు.

దృఢత్వమేదీ?

ఉమ్మడి జిల్లాలో చిన్నారులు పోషకాహారలేమితో బాధపడుతున్నారు. యాభై శాతానికిపైగా చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువులేరు. పది శాతానికి పైగా బాలలు అత్యంత పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. ప్రభుత్వం పెడుతున్న మధ్యాహ్న భోజనం కడుపునింపగలుగుతోంది కానీ పోషకాలు అందించడంలేదు. చాలా మంది చిన్నారులు సాయంత్రానికి నీరసించి పోతున్నారు. పోషకాహారం అందించి రోజూ గంటపాటు ఆటలు ఆడించగలిగితే వారిలో శారీరక దృఢత్వం ఏర్పడుతుంది. నిత్య సాధన, వ్యాయామం చేస్తే ఫిజికల్ ఫిట్‌నెస్ సాధించి క్రీడల్లో రాణించేందుకూ అవకాశం ఉంటుంది. అవేమీ కన్పించడం లేదు.

ప్రోత్సాహం లేదు




క్రీడలకు శిక్షకుల నియామకం మొదలు, నిధుల కేటాయింపుల వరకు సమస్యలే ఉన్నాయి. ఫలితంగానే మన ప్రాంతం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు తయారుకాలేదు. ఉత్తరాఖండ్, పంజాబ్ వంటి ప్రాంతాల్లో ఆటలు ఆడేందుకు అనేక మైదానాలు, శిక్షకులు ఉంటారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు ప్రతి విద్యార్థి మైదానంలో గడపాలనే నిబంధన అమల్లో ఉంది. అన్ని రకాల క్రీడా సామగ్రి అందించి, పీఈటీల నియామకం చేపడితే వందలో నలుగురు క్రీడాకారులు తయారవుతారు. -జితేందర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, జోగులాంబ


తగిన ఆహారం ఇస్తేనే




పిల్లల్లో పోషకాహారలోపం ఎక్కువగా కనిపిస్తోంది. శారీరకంగా, మానసికంగా, మేధోశక్తి పరంగా బలంగా ఉండాలంటే పిల్లల వయసుకు తగినట్లుగా ఆహారం ఇవ్వాలి. అన్ని రకాల మాంసకృత్తులు ఉండే ఆహారంతో పాటు, ఐరన్, కాల్షియం, ప్రోటీన్స్, విటమిన్-డి ఉండే ఆహారం అందించడం వల్ల ఎముకల పుష్టి బాగా ఉంటుంది. క్రీడలతో పాటు, చదువులోనూ చురుగ్గా రాణించేందుకు అవకాశం ఉంటుంది. -సుధారాణి, డీడబ్ల్యూవో, గద్వాల

200 మంది విద్యార్థులను ప్రశ్నిస్తే..







చెరలోనే 10 శాతం స్థలాలు!



న్యాయస్థానం ఉత్తర్వులు అమలయ్యేనా.. ఆక్రమణలు తొలగేనా?



బీరెల్లిదారిలో సగం కబ్జా కాగా మిగిలిన స్థలంలో పార్కు నిర్మాణం

గద్వాల, న్యూస్‌టుడే: పురపాలికల్లో ఇళ్ల స్థలాల విక్రయానికి ఎక్కడ వెంచర్లు వేసినా పది శాతం స్థలం ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించాలి. ఆ తర్వాతే అనుమతులు మంజూరవుతాయి. వాటిని అదే కాలనీలో నివాసం ఉండే ప్రజలకు పార్కులు, చిన్నారులకు ఆట స్థలాలు, ఇతర ఉమ్మడి అవసరాల కోసం వినియోగించాలన్నది పుర నిబంధన. కానీ అమలులో చిత్తశుద్ధి లోపించింది. పార్కుల నిర్మాణం దేవుడెరుగు కబ్జా కాకుండా కాపాడుకుంటే చాలన్న విధంగా పరిస్థితి తయారైంది. గద్వాల పుర పరిధిలో ఇలాంటి స్థలాల విలువ రూ.కోట్లలోనే ఉంది. కానీ వాటికి కాపాడటంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతోంది.

నాడు ఏంచేశారు

గద్వాల నడిబొడ్డున ఉన్న పది శాతం ఖాళీ స్థలాలను గతంలో పాలకులు కులసంఘాల, కమ్యూనిటీ భవనాలు, ప్రార్థనా మందిరాలకు కౌన్సిల్ తీర్మానంతో రాసిచ్చేశారు. వాటిలో గతంలో కొన్ని నిర్మాణాలు వెలిశాయి. తాజాగా కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. బీరెల్లి చౌరస్తా, కుంట వీధి, సుంకులమ్మమెట్టు, వేణుకాలనీ, రెండో రైల్వేగేటు, వంటి ప్రధాన కాలనీలలో విలువైన స్థలాలున్నాయి. వీటిలో కొందరు పలుకుబడి గల నేతలు ప్రధాన వ్యక్తుల సొంత నిర్మాణాలు సైతం ఉన్నాయి.

పారదర్శకత ఏదీ

క్షేత్ర స్థాయిలో తొలగింపుల్లో పారదర్శకత లోపించిందంటూ గద్వాల చెందిన రవీందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించి ఆధారాలతో సహా సమర్పించారు. దీనిపై విచారణ చేసిన హైకోర్టు పురపాలికలో ఆక్రమణ గురైన పది శాతం స్థలాల్లో గతంలో నిర్మించిన ఆక్రమణలు వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. తొలగించి అనంతరం వాటి రక్షణకు తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని పురపాలిక అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో యంత్రాంగంలో కదలిక వచ్చి జులై 22 తేదీన నిర్మాణం పూర్తయిన కుల సంఘాల భవనాలు, ప్రార్థనా మందిరాలకు అధికారులు నోటీసులు ఇచ్చారు. వెంటనే తొలగించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. 15 రోజుల్లో తొలగించని పక్షంలో తామే స్వయంగా చర్యలు తీసుకోనున్నట్లు పుర అధికారులు అందులో పేర్కొన్నారు.

హైకోర్టు ఏం చెప్పింది

ఉమ్మడి అంధ్రప్రదేశ్ సమయంలో హైదరాబాద్‌లో పది శాతం స్థలాల ఆక్రమణపై పోలారెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించటంతో కేసు దాఖలైంది. విచారణల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలికల్లో పది శాతం స్థలాల్లో ఉన్న భవనాలు, ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. 2007లో హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పునకు అనుగుణంగా పురపాలిక యంత్రాంగం ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టినా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. కానీ పూర్తిస్థాయిలో తొలగించినట్లు హైకోర్టుకు అప్పటి పుర అధికారులు నివేదిక ఇచ్చారు.

పూర్తి వివరాలతో నివేదించాం

పురపాలికలో పది శాతం స్థలాల తాజా స్థితిపై హైకోర్టు ఆదేశాల మేరకు పూర్తి వివరాలతో జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు త్వరలోనే తీసుకోనున్నాం

-దశరథ్, గద్వాల పురపాలిక అధికారి

ఎల్‌పీ ఉన్న 65 వెంచర్ల వివరాలు (ఎకరాల్లో)	
కేటాయించిన పది శాతం స్థలం	47.15
పాఠశాలల నిర్మించినవి:	1.75
కమ్యూనిటీ భవనాలున్నవి	2.11
ఇతరాలు	4.11
ఆక్రమణలో ఉన్నవి	7.98

చిన్న వయసులోనే కవిత్వ రచన అభినందనీయం



దేవగన్నేరు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తదితరులు

వెల్దండ, న్యూస్‌టుడే : పాఠశాల స్థాయిలోనే 3వ తరగతి నుంచి 7వ తరగతి చిన్నారులు కవిత్వాలు రాయడం అభినందనీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు రచించిన కవిత్వాలు దేవగన్నేరు పుస్తకాన్ని గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేవిడ్ రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దడం, విద్యార్థులతో కవిత్వ రచన చేయించిన ఉపాధ్యాయుల కృషిని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అజిలాపూర్ పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి విద్యతోపాటు వివిధ రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. విద్యార్థుల కవితా రచనకు ప్రోత్సహించిన పాఠశాల తెలుగుపండిట్ తగుళ్ళ గోపాల్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌పీడీ రమేశ్, కవి యాఖూబ్, ఇన్‌ఛార్జి ఎంఈవో చంద్రుడు, నోడల్ అధికారి రవీందర్, ఉపాధ్యాయులు, నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌యాదవ్, లక్ష్మయ్య, కాలే లక్ష్మమ్మ, కేశమళ్ల లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

30న ఉమ్మడి జిల్లా ఎంపికలు

ధన్వాడ, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ ఎంపికల్ని ఈ నెల 30న ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు, పీడీ ఊసు రవికుమార్, కోచ్ శ్రీనివాసులు గురువారం వెల్లడించారు. 14, 17, 19 ఏళ్లలోపు విభాగాల్లో ఎంపికలు ఉంటాయని తెలిపారు. 14 ఏళ్లలోపు విభాగానికి జనవరి 1, 2011, అండర్ 17 విభాగానికి జనవరి1, 2008 తర్వాత జన్మించిన వారే అర్హులన్నారు. విద్యార్థులు ఒరిజినల్ బోనఫైడ్‌తో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

ధన్వాడలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు

ధన్వాడ, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)లో భాగంగా రెజ్లింగ్(కుస్తీ) పోటీలను వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట జిల్లాలోని ధన్వాడలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.రాంరెడ్డి పేరున జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. అప్పాజీ మైదానంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 14, 17, 19 ఏళ్లలోపు బాలికల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోస్గి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 17 ఏళ్లలోపు బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించనున్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింలు(8179254453)ను సంప్రదించాల్సిందిగా ఉత్తర్వులో కోరారు.

మిల్లు నుంచి సీఎంఆర్ పక్కదారి?

గ్రామస్థులు అడ్డుకోవడంతో గోదాంకు తరలించిన వైనం



బియ్యం మిల్లు నుంచి పెబ్బేరులోని మార్కెట్ యార్డులో ఉండే గోదాం వద్దకు తీసుకొచ్చిన సీఎంఆర్ ధాన్యం



మిల్లు యజమాని దరఖాస్తుపై డీఎం ముద్ర

పెబ్బేరు, వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : ఓ మిల్లు నుంచి సీఎంఆర్ ధాన్యం అక్రమంగా తరలిస్తుండగా.. గ్రామస్థులు అడ్డుకున్న ఘటన గురువారం పెబ్బేరులో చోటు చేసుకొంది. పెబ్బేరు మండలం ఏటిగడ్డ శాఖాపూర్‌లో ఉండే ఓ బియ్యం మిల్లు నుంచి 650 బస్తాల సీఎంఆర్ ధాన్యాన్ని లారీలో ఇతర రాష్ట్రానికి తరలిస్తుండగా గ్రామస్థులు మధ్యలో అడ్డుకున్నారు. ఆ ధాన్యాన్ని పెబ్బేరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మిల్లు యజమాని లీజుకు తీసుకున్న గోదాంకు తరలించి నిల్వ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యం గోదాంలో నిల్వ చేసుకొని మర ఆడించడానికి మిల్లుకు తరలించాల్సి ఉండగా.. మిల్లు నుంచి గోదాంకు ఎలా తరలిస్తారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ధాన్యం తరలింపుపై పోలీసులకు సమాచారం అందిస్తే పట్టించుకోలేదని ఆరోపించారు. వనపర్తి జిల్లాలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు చేస్తున్న సమయంలోనే మిల్లు యజమానులు ధాన్యం తరలించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై జిల్లా పౌర సరఫరాల అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ మిల్లు నుంచి గోదాంకు ధాన్యం బదిలీ చేసుకునేందుకు యజమానికి తమకు దరఖాస్తు చేయలేదన్నారు. ధాన్యం తరలిస్తున్న విషయం తమకు తెలియడంతో సిబ్బందిని పంపించామని, మిల్లు యజమాని లీజుకు తీసుకొన్న గోదాంలో నిల్వ చేసినట్లు విచారణలో తేలిందని ఆయన పేర్కొన్నారు. పౌర సరఫరాల సంస్థ డీఎం ఇర్ఫాన్ మాట్లాడుతూ ఈ నెల 25న తాను కోర్టు పనిపై వెళ్లానని, కార్యాలయంలో అందుబాటులో లేనని చెప్పారు. ధాన్యం బదిలీకి అవకాశం ఇవ్వాలని కార్యాలయంలో దరఖాస్తు సమర్పించినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. డీఎం ఇలా చెబుతుంటే ఈ నెల 25న మిల్లు యజమాని డీఎంకు దరఖాస్తు చేసుకోగా ముద్రలు వేసినట్లు ఫొటోలు బయటకు రావటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

మిల్లు యజమాని జగన్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా తమ మిల్లులో కొన్ని నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండటంతో తప్పని పరిస్థితుల్లో అక్కడి ధాన్యాన్ని తాను లీజుకు తీసుకున్న గోదాంలో నిల్వ చేసేందుకు లారీలో పెబ్బేరుకు తరలించామని పేర్కొన్నారు. పనులు పూర్తయ్యాక మిల్లుకు తీసుకొచ్చి మర ఆడిస్తామని, ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నామనే ఆరోపణల్లో నిజం లేదని చెప్పారు.

వైద్యవిజ్ఞాన మేళాతో విద్యార్థులకు మేలు



మాట్లాడుతున్న ఎస్‌వీఎస్ ఆసుపత్రి ఎండీ డా.కేజే రెడ్డి, చిత్రంలో డైరెక్టర్ రాంరెడ్డి, ప్రిన్సిపల్ డా.జోషి తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే : వారం పాటు నిర్వహించిన వైద్య విజ్ఞాన మేళా వల్ల విద్యార్థులకు ఎంతో మేలు కలిగిందని ఎస్‌వీఎస్ ఆసుపత్రి ఎండీ డా.కేజే రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మహబూబ్‌నగర్ పట్టణం ఏనుగొండలోని ఎస్‌వీఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు వైద్యవిద్యపై ఆసక్తి కలిగితే భవిష్యత్తులో వారు వైద్యులు వైద్యులయ్యే అవకాశం ఉంటుందన్నారు. మేళాలో 25 వైద్య విభాగాలతో 1,200 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యార్థుల మేళాను సందర్శించి అనేక విషయాలు తెలుసుకున్నారని చెప్పారు. తమ ఆసుపత్రి, వైద్య కళాశాలలను స్థాపించి 25 ఏళ్లవుతున్న నేపథ్యంలో ఈ మేళా నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ ఆసుపత్రి డైరెక్టర్ రాంరెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.జోషి, ప్రసన్న, లింగం, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతోష్‌కు 5 కొలువులు



సంతోష్ కుమార్

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : నేటి పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వ కొలువు సాధించడమే కష్టం.. అలాంటిది ఆ యువకుడు ఏకంగా 5 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. నారాయణపేట జిల్లా కోస్గి పురపాలకసంఘం పరిధిలోని గుండ్లపల్లికి చెందిన సంతోష్‌కుమార్ ఓవైపు ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే పోటీపరీక్షలకు సిద్ధమయ్యాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో నీటిపారుదలశాఖ ఏఈఈ, పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్, మున్సిపాలిటీ పట్టణ ప్రణాళిక అధికారి, పంచాయతీ రాజ్ ఏఈతో పాటు గ్రూప్-4లో సైతం అర్హత సాధించినట్లు వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలువురికి నియామకపత్రం అందజేశారు. నీటిపారుదలశాఖ ఉద్యోగాన్ని ఎంచుకున్న సంతోష్ ముఖ్యమంత్రి నుంచి నియామక ఉత్తర్వు తీసుకున్నారు. ప్రాథమిక విద్య స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, 6 నుంచి పదో తరగతి వరకు కోస్గి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో బీటెక్ పూర్తిచేశాడు. అనంతరం హైదరాబాద్‌లోని స్థిరాస్థి కంపెనీలో ఉద్యోగం చేస్తూనే 2022లో విడుదలైన నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసి పరీక్షలకు సిద్ధమయ్యారు. తల్లిదండ్రులు వెంకటయ్య, నర్సమ్మలు వ్యవసాయం చేస్తుంటారు. మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన సంతోష్ విజయాలు సాధించడంతో స్వగ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గద్వాలలో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య



అశోక్ (పాతచిత్రం)

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గద్వాలలో చోటు చేసుకుంది. గద్వాల పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ కథనం మేరకు.. పుర పరిధిలోని వేణు అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అశోక్ (42) కేఎల్ఐ క్యాంపులోని నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ 1 కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఇటీవల సీనియర్ అసిస్టెంట్‌గా పెబ్బేరుకు బదిలీ అయ్యారు. బుధవారం సాయంత్రం తాను కార్యాలయ పనిపై హైదరాబాద్‌కు వెళ్తున్నానంటూ తన భార్య వీరావతికి చెప్పి వెళ్లాడు. గురువారం ఉదయం అశోక్ ఇదివరకు గద్వాలలో పని చేసిన కార్యాలయాన్ని అటెండర్ తెరిచి లోపలికి వెళ్లగా కార్యాలయంలోని ఓ ఛాంబర్‌లో అశోక్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. ఆందోళనకు గురైన అటెండర్ కార్యాలయ సిబ్బందికి, పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు, అధికారులు చేరుకుని ఫ్యాన్‌కు వేలాడుతున్న అశోక్‌ను కిందకు దించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధరించారు. ఆర్థిక సమస్యల వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భార్య ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు. కాగా తాను షేర్‌మార్కెట్‌లో రూ.50 లక్షలు డిపాజిట్ చేశానని, ఇందులో తన స్నేహితులవి రూ.20 లక్షలు ఉన్నాయని రాసి జేబులో పెట్టుకున్న ఓ కాగితాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అశోక్ మృతికి పలు ఉద్యోగాల సంఘ నాయకులు సానుభూతి వ్యక్తం చేశారు. అశోక్‌కు కొందరు వడ్డీ వ్యాపారులు అప్పులు ఇచ్చారని, వడ్డీ విషయంలో కొందరు అతడిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని సన్నిహితులు అంటున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

తెరపై ఈనాడు
శ్రీనివాస: దేవరా – న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్యం కీలకం

వనపర్తి(గ్రామీణం, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య పరీక్షల శిబిరం కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవ, ఎంపీవో సుదర్శన్, మండల వైద్యాధికారి రాకేష్‌రెడ్డి, పంచాయతీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి : ఎమ్మెల్యే

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : పంచాయతీ సిబ్బంది, కార్మికులు నైపుణ్య శిక్షణ పొంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 4 రోజులుగా పంచాయతీ కార్మికులకు తాగునీటి సరఫరా, లీకేజీ, చేతి పంపుల మరమ్మతులు తదితర అంశాలపై ఇస్తున్న శిక్షణకు గురువారం ఎమ్మెల్యే విచ్చేసి మాట్లాడారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, డీఈఈ జైపాల్‌రెడ్డి, ఎంపీవో రవీంద్రబాబు, ఏఈ శివానంద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో పంచాయతీ కార్యదర్శుల నిరసన

ఆత్మకూరు, న్యూస్‌టుడే : నల్గొండ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల సామూహిక సస్పెన్షన్‌లకు నిరసనగా గురువారం


ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్యదర్శులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఉన్నతాధికారుల తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు హరిరాంసాగర్, ఆర్.మన్య, దాసు, వంశీధర్‌రెడ్డి, నాగరాజు, జైపాల్‌రెడ్డి, శిరీష, నాగరాజు, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అధ్యక్షురాలికి సత్కారం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పెబ్బేరు మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షురాలు, ఉపాధ్యక్షుడిగా నియమితులైన ప్రమోదిని


ప్రమోదినిరెడ్డిని సన్మానిస్తున్న పుర అధ్యక్షురాలు

రెడ్డి, ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డిని, డైరెక్టర్లను గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పురపాలిక పాలక వర్గం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పుర అధ్యక్షురాలు ఎద్దుల కరుణశ్రీ, ఉపాధ్యక్షుడు కర్రెస్వామి, కౌన్సిలర్లు చిన్న ఎల్లారెడ్డి, పార్వతి, పద్మ, సుమతి, గోపిబాబు పాల్గొన్నారు.

ఖిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: ఖిల్లాగణపురం ప్రభుత్వ ఆసుపత్రిని ప్రపంచ ఆరోగ్య సంస్థ సంచాలకులు డాక్టర్ వస్సి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వసతులు అడిగి తెలుసుకున్నారు. సంక్రమిక, అసంక్రమిక వ్యాధులపై డాక్టర్లతో చర్చించారు. జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డా.రామచంద్రారావ్, వైద్యాధికారులు ప్రవీణ్, జ్యోతి, రమేశ్, జిల్లా ప్రోగ్రాం సమన్వయ కర్త శ్రీనివాస్‌కొండ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆర్యవైశ్య సంఘం నాయకుల వినతి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభికి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు లక్ష్మీనారాయణ, విజయకుమార్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందజేత

పాన్‌గల్, న్యూస్‌టుడే: మాధవరావుపల్లి గ్రామంలో 2021లో విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందడంతో విద్యుత్ శాఖ అధికారులు మంజూరు చేసిన రూ.40వేల చెక్కును గురువారం రైతు శేషయ్యకు మాజీ ఎంపీటీసీ సుబ్బయ్య అందజేశారు.

ఆధార్ నమోదు గడువు పొడిగింపు

వనపర్తి పట్టణం : ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకొనేందుకు గడువు పొడిగించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. ఆధార్ నమోదు చేసుకోని వారు డిసెంబరు 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: మూడు నెలలుగా కార్యాలయానికి రాకుండా ఇంటి వద్దే విధులు నిర్వహిస్తున్న వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు గురువారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. అక్రమాలపై ఎక్సైజ్ మంత్రి, కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. బీసీ పొలిటికల్ ఛైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్, అంజన్నయాదవ్, మహేందర్, శివగౌడ్, శివనాయక్ ఉన్నారు.


పాన్‌గల్: గోప్లాపూర్‌లో ఐలమ్మ విగ్రహావిష్కరణలో నాయకులు


కొత్తకోట: ఐలమ్మ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న పట్టణ రజకసంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు


రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో చాకలి ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న గ్రామస్థులు

ఐలమ్మ పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకం


వనపర్తి పట్టణంలో నివాళి అర్పిస్తున్న భారాస నాయకులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తికోసం పోరాడిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని పలువురు నాయకులు కొనియాడారు. ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గురువారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఐలమ్మ విగ్రహానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, భారాస నాయకులు, మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో గురువారం నివాళి అర్పించారు. ఖిల్లాగణపురం మండల కేంద్రంతో పాటు పర్వతాపురం, మామిడి మాడ, సోళీపురం గ్రామాలలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవర కొండ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఐలమ్మ జీవిత చరిత్రపై మండల వ్యాప్తంగా 6-10 తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాన్‌గల్ మండలంలోని గోప్లాపూర్‌లో ఐలమ్మ విగ్రహావిష్కరణ చేశారు. పోరాట సాధన కోవాలన్న స్ఫూర్తికి ఐలమ్మ నిదర్శనమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. కొత్తకోటలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అమరచింత పట్టణంలో రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రేవల్లి మండల పరిధిలోని నాగపూర్ గ్రామంలో ఐలమ్మకు నివాళులర్పించారు. పెబ్బేరు పట్టణం, ఆత్మకూరు పట్టణంలో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మదనాపురం మండల కేంద్రంతో పాటు కొన్నూర్, దుప్పల్లి గ్రామాల్లో గురువారం కాంగ్రెస్, రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదినిరెడ్డి సూచించారు. గురువారం ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆక్కి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పించారు.




అమరచింత : పూలమాలతో నివాళి అర్పిస్తున్న రజక సంక్షేమ సంఘం సభ్యులు.. మదనాపురంలో నాయకులు... పెబ్బేరు: నివాళులర్పిస్తున్న జిల్లా రజక ఉద్యోగ సంఘం సభ్యులు

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: యువత విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు నైపుణ్యాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. గురువారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో వనపర్తిలోని ఇండోర్‌స్టేడియం జిల్లా స్థాయి యువజనోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనతోపాటు అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో 15 నుంచి 29 సంవత్సరాల యువతకు యువజనోత్సవ కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. అనంతరం పలువురు జానపద నృత్యాలు, గేయాలు, కవిత్వం, వ్యాసరచన ఉపన్యాస తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అమరచింత, న్యూస్‌టుడే : పోషకాహారంతోనే ఆరోగ్యంగా జీవిస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద అన్నారు. మండలంలోని పామిరెడ్డిపల్లె గ్రామంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ మాసం' సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు శ్రీమంతం చేసి, అందరు కలిసి సామూహిక భోజనం చేశారు. వంటల పోటీలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుడు రాకేష్, అంగన్‌వాడీ టీచర్ జగదంబ పాల్గొన్నారు.

వనపర్తి(గ్రామీణం, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యమని డీడబ్ల్యూవో లక్ష్మమ్మ అన్నారు. గురువారం మండలంలోని చిట్యాల రైతు వేదికలో ఇన్‌ఛార్జి సీడీపీవో హాజీరాబేగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసనం, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ గ్రామాల అంగన్‌వాడీ కేంద్ర టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


వనపర్తి: చిట్యాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

కూరగాయల మార్కెట్ పునరుద్ధరించాలి

కొత్తకోట, న్యూస్‌టుడే: పురపాలికలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యాలయం వెనక కూరగాయల మార్కెట్ ఉండేదని దానిని పునరుద్ధరిస్తామని భవనాన్ని నేల మట్టం చేసి తమను నిరాశ్రయుల్ని చేసి నాలుగేళ్లయినా స్పందన లేదని వివరించారు. గ్రామ పంచాయతీ నాటి స్థలంలోనే మార్కెట్‌ను నిర్మిస్తే తమకు ఉపయోగ కరంగా ఉంటుందని వివరించగా ఎమ్మెల్యే స్థలాన్ని సర్వే చేయించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కూరగాయల వ్యాపారులు

సురక్షితమైన తాగు నీరందించడమే లక్ష్యం

పెబ్బేరు, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి సురక్షితమైన తాగునీరందించడమే లక్ష్యమని మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి అన్నారు. గురువారం శ్రీరంగాపూర్, పెబ్బేరు మండలాల గ్రామ మంచి నీటి సహాయకులు, కారోబర్లకు ఏర్పాటు చేసిన మూడో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు.

గణపసముద్రం ముంపు రైతులకు న్యాయం చేయండి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: గణపసముద్రం ముంపు రైతులకు ప్రభుత్వం ఎకరాకు 25లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ముంపు రైతులు గురువారం ఆందోళన నిర్వహించారు. ఎలాంటి పరిహారం చెల్లించకుండా దౌర్జన్యంగా పనులు చేయడం కాంట్రాక్టర్‌కు తగదని నిరసన తెలిపారు. గుత్తేదారు వచ్చి సమాధానం చెప్పే వరకు పనులు జరగనివ్వమని హెచ్చరించారు. చేసేదేమి లేక సిబ్బంది గుత్తేదారుతో చరవాణిలో రైతులతో మాట్లాడించగా శుక్రవారం వచ్చి మాట్లాడుతామని డీఈ హామీ ఇవ్వడంతో రైతులు తిరిగి వెళ్లారు.


గణప సముద్రం దగ్గర ఆందోళన చేస్తున్న ముంపు రైతులు

ఆరోగ్య ప్రశస్త్‌పై ఉపాధ్యాయులకు అవగాహన

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : శ్రీరంగాపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆరోగ్య ప్రశస్త్ యాప్‌పై మండల విద్యాధికారి హన్మంతు అధ్యక్షతన గురువారం ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రీసోర్స్ పర్సన్ మురళీకృష్ణ అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక వికలత్వంతో పాటు, కొందరు గుర్తించలేని లోపాలు, ఆరోగ్య సమస్యలతో బాధపడే వారి కోసం ఎన్‌సీఈఆర్టీ ప్రత్యేకంగా ప్రశస్త్ పేరుతో యాప్‌ను రూపొందించిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, సీఆర్పీ శ్రీలత పాల్గొన్నారు.

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వనపర్తి మండల ఉపాధ్యాయులకు ప్రశస్త్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త యుగంధర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులలో ఉన్న లోపాలకు గుర్తించి అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి మద్దిలేటి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఆర్పీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్

అమరచింత, న్యూస్‌టుడే : వ్యవసాయ ఖర్చులను పరిగణలోకి తీసుకుని కృష్ణవేణి చక్కెర కంపెనీ యాజమాన్యం చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కృష్ణవేణి చెరకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.రాజన్న డిమాండ్ చేశారు. గురువారం చంద్రగడ్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకుకు గిట్టుబాటు ధర రూ.4800 ఇవ్వాలని కోరారు. అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు సరఫరా చేసి, రైతుల ఖాతాలో 45 రోజులో డబ్బులు జమ చేయాలని కోరారు. చెరకు రైతు సంఘం చంద్రగడ్ గ్రామ అధ్యక్షుడిగా నల్లరెడ్డి, ఉపాధ్యక్షులుగా శివారెడ్డి, కార్యదర్శులుగా చంద్రుడు, సుదర్శన్, భీమన్నలు ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వాసారెడ్డి, రవి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు జ్ఞాపకశక్తి పెంపొందించుకోవాలి

పెబ్బేరు, న్యూస్‌టుడే: విద్యార్థులు జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవాలని గణిత అవధాని అనంతప్ప సూచించారు. గురువారం మండలంలోని యాపర్ల ఉన్నత పాఠశాలలో గణితంలో వంద సంఖ్యల వరకు పేర్లు రాసి, సంఖ్యలను అడిగితే చెప్పే జ్ఞాపకశక్తిని పెంపొందించుకునే పద్ధతిని నేర్పించారు. దీంతో విద్యార్థులు గణితం పట్ల ఆసక్తిని పెంచుకొన్నారు. అనంతరం అవధాని అనంతప్పను ఘనంగా సన్మానించారు. పాఠశాల జీహెచ్ఎం శంకర్ గౌడు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ జయమ్మ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహాగర్జన జయప్రదం చేయండి

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జరిగే విద్యార్థి మహాగర్జన సభను జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో "చలో హైదరాబాద్" మహాగర్జన కరపత్రాలను విడుదల చేశారు. మండల కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ. 8,245 కోట్ల స్కాలర్‌షిప్ రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

పాన్‌గల్, పెబ్బేరు పట్టణం, శ్రీరంగాపురం, వీపనగండ్ల(చిన్నంబావి), ఆత్మకూరు, అమరచింత న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికులు చేస్తున్న పారిశుద్ధ్య పనులు మరువలేనివని జిల్లా డీఆర్డీవో పీడీ ఉమాదేవి అన్నారు. గురువారం పాన్‌గల్ రైతు వేదిక మండలంలోని కార్మికులకు ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు చంద్రశేఖర్ వైద్యపరీక్షలు చేశారు. పెబ్బేరు పట్టణంలో గురువారం పుర అధ్యక్షురాలు ఎద్దుల కరుణశ్రీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ రవీందర్ ఆధ్వర్యంలో పెబ్బేరు పీహెచ్‌సీ ఆవరణలో పంచాయతీ కార్మికులకు వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శ్రీరంగాపురం, వీపనగండ్ల పీహెచ్‌సీలో, చిన్నంబావి మండలంలోని కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆత్మకూరు పురపాలిక కార్యాలయంతో పాటు మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అమరచింతలో కార్మికులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని డీఎంఆర్ఎం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించారు.


పెబ్బేరు: ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


పాన్‌గల్‌లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డా.చంద్రశేఖర్, చిత్రంలో డీఆర్డీవో పీడీ ఉమాదేవి

విగ్రహాల ప్రతిష్ఠాపనకు విరాళాల సేకరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం ఆలయ కమిటీ సభ్యులు పట్టణంలో విరాళాల సేకరణ చేపట్టారు. మాజీ ఎంపీపీ ఎం.శ్రీధర్ గౌడ్ నేతృత్వంలో కమిటీ బాధ్యులు రూ.15 లక్షల వరకు వ్యయం చేసే పరిస్థితి ఉన్న క్రమంలో పట్టణంలోని దాతలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాల్సిందిగా కోరారు. కమిటీ సభ్యులు, గురుస్వాములు జిన్నారం శ్రీనివాసులు, కూరగాయల రఘు, దివాకర్, బాలు, తోట రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలి

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : గురుకుల పాఠశాలల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులపై ఉందని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల రాష్ట్రకార్యదర్శి అలగు వర్షిణి సూచించారు. గోపాల్‌పేట మండలం బుద్దారంలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

కాల్వ గండి పూడ్చివేత

వనపర్తి(గ్రామీణం, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన వర్షాలకు చందాపూర్ గ్రామం మీదుగా వెళుతున్న డి3 కాల్వకు గండి పడి నీరు పొలాల్లోకి వెళ్లాయి. ఈ విషయమై గ్రామస్థులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే గండి మరమ్మతు పనులను చేపట్టాలని సూచించడంతో గురువారం అధికారులు పూడ్చివేత పనులను చేపట్టారు. అలాగే కాల్వ వెంట పిచ్చి మొక్కలు తొలగించారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : శ్రీరంగాపురంలో మండల పీఆర్టీయూటీఎస్ సంఘ సభ్యులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్ హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. పీఆర్టీయూటీఎస్‌తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బొద్దరెడ్డి, రామచంద్రయ్య, దాసరిచిన్నరాములు, రాజు, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

భాజపా..

రేవల్లి(గోపాల్‌పేట), న్యూస్‌టుడే : రేవల్లి మండల పరిధిలోని నాగపూరు, కొంకలపల్లి గ్రామాలలో గురువారం భాజపా నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. భాజపా చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమాల్లో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అజయ్ గౌడు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలుగురాయి తరలిస్తున్న లారీల పట్టివేత

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే : పలుగురాయి గుట్టలను తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న లారీలను గురువారం రాత్రి రేవల్లి మండలంలో పట్టుకున్నారు. వివరాలలోకి వెళితే... కేశంపేట తండాకు చెందిన తిరుపతినాయక్ గురువారం సాయంత్రం 6గంటలకు పలుగురాయి లోడ్‌తో వెళుతున్న 4లారీలను మండల పరిధిలోని గొల్లపల్లి శివారులో అడ్డుకున్నాడు. విషయాన్ని తహసీల్దార్ లక్ష్మీదేవికి, పోలీసులకు ఫోన్‌ద్వారా తెలియజేశాడు. పలుగురాయి తరలిస్తున్న విషయం తమకు తెలియదని, ఎటువంటి అనుమతులు తమ వద్దలేవని సమాధానం ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌ను అక్కడికి పంపించారు. రేవల్లి ఎస్సై రాము అందుబాటులో లేకపోవడంతో ఏఎస్సై మల్లయ్యకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 4 లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొందరు పైరవీకారులు పోలీసులను, అధికారులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయమై ఏఎస్సై మల్లయ్యను వివరణ కోరగా.. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఇదే విషయాన్ని వనపర్తి పోలీసు సీఐ నాగభూషణరావు దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయమై తనకు ఎటువంటి సమాచారం లేదని, పూర్తి విషయాలు తెలుసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.


రేవల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిచున్న లారీలు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పి.దాసు, గౌరవ అధ్యక్షుడిగా హరిరాం సాగర్, ఉపాధ్యక్షులుగా శిరీష, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.మన్యం, కోశాధికారిగా వంశీధర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా సయ్యద్ రిజ్వీ, సలహాదారులుగా జైపాల్‌రెడ్డి, లక్ష్మీ నారాయణ ఎన్నియ్యారు.

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నూతన కమిటీని గురువారం పట్టణంలోని బండార్‌నగర్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రంగస్వామి, ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య, అలివేల, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాసులు గౌడ్, మహిళా కార్యదర్శిగా పద్మమ్మ, కార్యదర్శిగా మన్య నాయక్, కోశాధికారిగా చంద్రశేఖర్, మీడియా కార్యదర్శిగా విజయ్ కుమార్, ప్రచార కార్యదర్శిగా కిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి.. **వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే:** ద్విచక్రవాహనంపై అదుపుతప్పి కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి 10 గంటలకు మండలంలోని అచ్యుతాపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అశోక్(28) గురువారం రాత్రి ఇంటి నుంచి వనపర్తికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా అచ్యుతాపురం క్రాస్ రోడ్డు సమీపంలో మూలమలుపు వద్ద అదుపు కిందపడి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. గ్రామీణ ఎస్సై జలెందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు.. **అమరచింత, న్యూస్‌టుడే :** మండలంలోని చంద్రగడ్ గ్రామానికి చెందిన మంగమ్మ (72) గురువారం ఉదయం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై బి.సురేశ్ తెలిపారు. మృతురాలి కుమార్తె చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా.. మంగమ్మ భర్త జి.రంగారెడ్డి 6 ఏళ్ల కింద మృతి చెందడంతో పెద్ద కుమార్తె చిట్టెమ్మతో కలిసి ఉంటోంది. బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పరిస్థితి విషమించడంతో జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి శవపంచనామ చేసి మృతదేహం బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

బంగారు గొలుసు చోరీ.. కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : కొబ్బరి బోండాలు కావాలని తీసుకున్న ఇద్దరు వ్యక్తులు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. అంబాభవాని ఆలయం ఎదురుగా నాగమ్మ అనే మహిళ కొబ్బరి బోండాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి కొబ్బరి బోండాలు అడగగా ఆమె అందించింది. వెంటనే ఆమె మెడలో బంగారు గొలుసును తెంచుకొని ద్విచక్రవాహనంపై పారిపోయారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై మంజునాథరెడ్డిని వివరణ కోరగా.. విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

పొలంలోకి వెళ్లకుండా అడ్డుకున్నందుకు కేసు.. గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండల పరిధిలోని మున్ననూరు గ్రామానికి చెందిన పుష్పలత, శ్రీధర్‌గౌడు దంపతులు తమ సొంత పొలాన్ని పాన్‌గల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డికి విక్రయించారు. వారు పొలం చుట్టూ కంచెపెట్టి గేటు ఏర్పాటు చేసుకున్నారు. అయితే పక్కపొలానికి చెందిన నారాయణగౌడ్, ఆయన భార్య కృష్ణమ్మ పొలానికి కాపలాదారుగా ఉండే వ్యక్తిని అడ్డుకున్నారు. దీంతో పొలం యజమాని నవీన్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేశామని ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. గతంలో కూడా రెండుసార్లు అడ్డుకోవడంతో వారిపై కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు.

పత్తి పంట ధ్వంసం చేశారని.. అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని కొంకలవానిపల్లె గ్రామానికి చెందిన గొల్ల పెద్ద సాయన్నకు చెందిన 1 ఎకరా పత్తిపంట గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామని ఎస్సై బి.సురేశ్ తెలిపారు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా సాయన్న పత్తి పంట ధ్వసమైనట్లు గుర్తించామన్నారు.

వ్యక్తి అదృశ్యం.. **కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే :** టీ తాగి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథరెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన జమున, శ్యామ్ దంపతులు కొత్తకోటలోని రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటూ ఓ మెడికల్ దుకాణాన్ని నడిపిస్తున్నారు. బుధవారం సాయంత్రం దుకాణం నుంచి టీ తాగి వస్తానని భార్యకు చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకి లభ్యంకాలేదు. గురువారం భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


శ్యామ్ (పాతచిత్రం)

చిట్టీల పేరుతో మోసం.. **కొతకోట గ్రామీణం, న్యూస్‌టుడే :** పురపాలికలోని ఓ కాలనికి చెందిన వ్యక్తి కొందరితో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ కొన్ని నెలలుగా తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా దాటవేస్తున్నాడు. చిట్టీ డబ్బులు, అప్పు తీసుకున్న డబ్బులు ఇవ్వాలని బాధితులు నిలదీయడంతో రేపుమాపు అంటూ చెప్పుకొచ్చాడు. ఆ వ్యక్తి భార్య కూడా కొందరి వద్ద అప్పులు చేసినట్లు బాధితులు తెలిపారు. డబ్బులు చెల్లించాలని వారం రోజులుగా ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో భార్యాభర్తలిద్దరు ఉడాయించారు. తీసుకున్న డబ్బులను ఇప్పించి తమకు న్యాయం చేయాలని బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయంపై ఎస్సై మంజునాథరెడ్డిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.